www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
09 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 281

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## కిరాయి కూడా కట్టలేవా రేవంత్?

02



- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆరోపణలు
- విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు
- రాష్ట్రంలో గురుకుల భవనాలు
- ఏడాది నుంచి అద్దె బకాయిలు
- ఇదంతా రేవంత్ రెడ్డి కుట్ర
- కేసీఆర్ పేరు చెడగొట్టేయత్నం
- గురుకులాల నిర్వహణలో విఫలం

## నేను పోటీ చేస్తా ప్లీజ్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- ముహూర్తం దగ్గర పడుతుంది
- 13న నోటిఫికేషన్ విడుదల
- బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది
- బీజేపీ అధిష్టానం త్రిసభ్య కమిటీ
- గతంలో ఓడిన లంకల దీపక్ రెడ్డి
- బరిలో ఉంటానంటున్న మాధవీలత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముహూర్తం దగ్గర పడుతుంది.ఇప్పటికే షెడ్యూల్ విడుదలకాగా ఈనెల 13న నోటిఫికేషన్ విడుదల కానున్న సంగతి తెలిసిందే.ఈ ఉప ఎన్నికకు సంబంధించి బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతుంది.సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగానే అన్న పార్టీల కంటే అభ్యర్థిని ముందే ప్రకటించింది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను అభ్యర్థిగా ప్రకటించింది. సెంటిమెంట్ కార్డ్ వర్కౌట్ అవుతుందనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఎన్నికల సమరంలోకి దిగింది. అటు అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. మరోవైపు బీజేపీ సైతం అభ్యర్థి కోసం జల్లెడపడుతుంది. బలమైన అభ్యర్థిని బరిలోకి దించి విజయం సాధించాలనే ధీమాగా ఉంది.

**బీజేపీ చీఫ్‌కు సీల్డ్ కవర్ నివేదిక**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి కోసం బీజేపీ అధిష్టానం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.ఇప్పటికే బీజేపీ నాయకులు పార్టీ కేడర్ నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు నియమించిన త్రిసభ్య కమిటీ తన నివేదికను రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు అందజేసింది. ఈ త్రిసభ్య కమిటీలో మాజీ ఎమ్మెల్యే ఎం .ధర్మారావు, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, పార్టీ సీనియర్ నేత, అడ్వొకేట్ కోమల ఆంజనేయులు సభ్యులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ త్రిసభ్య కమిటీ తాజాగా తన నివేదికను సీల్డ్ కవర్‌లో స్టేట్ చీఫ్‌కు అందజేసింది.అయితే సీల్డ్ కవర్‌లో అభ్యర్థులుగా జూటూరు కీర్తి రెడ్డి, వీరపనేని పద్మ, లంకల దీపక్ రెడ్డిలను

మిగతా 2లో..



# నేడే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్

**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నిక ముఖ్యమైన నోటిఫికేషన్**

స్థానిక సంస్థల ఎన్నికల తేదీల ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. కాగా, 5 దశల్లో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈసీ షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం (అక్టోబర్ 9) నాడు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తొలి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అనంతరం ఉదయం 10:30 గంటల నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తారు. అలాగే అక్టోబర్ 13 నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్ల ప్రక్రియ మొదలుపెడతారు. అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్.. అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ ఉంటుంది.

- కోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశం
- ఎన్నికల నోటిఫికేషన్ రానుంది
- హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్
- ఎన్నికల సంఘం సన్నద్ధత
- నవంబర్ 11న ఓట్ల లెక్కింపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అత్యంత ముఖ్యమైన నోటిఫికేషన్ వెలువడడానికి మార్గం సుగమం అయింది. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతున్నప్పటికీ.. ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేయడానికి న్యాయస్థానం నిరాకరించింది. దీనితో రాష్ట్ర ఎన్నికల సంఘం దూకుడు పెంచింది. షెడ్యూల్ ప్రకారం.. ఎంపీటీసీ , జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి గురువారం నాడు నోటిఫికేషన్ విడుదల కానుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అడ్డంకులు తొలగించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. నోటిఫికేషన్ విడుదలను ఆపడానికి స్టే జారీ చేయాలని పిటిషనర్లు కోరినప్పటికీ.. న్యాయస్థానం వారి విజ్ఞప్తిని తిరస్కరించింది. ఈ తీర్పు ఫలితంగా.. ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగడానికి లైన్ క్లియర్ అయింది. బీసీ రిజర్వేషన్ల అంశంపై తదుపరి న్యాయ విచారణ మాత్రం రేపటికి (గురువారానికి) వాయిదా పడింది. హైకోర్టు ఆదేశాల అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. తొలుత తమ లీగల్ బృందంతో సమాలోచనలు జరిపిన ఎస్ఈసీ.. ఆ వెంటనే రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సమావేశంలో నామినేషన్ల స్వీకరణ, శాంతిభద్రతల పర్యవేక్షణ, ఎన్నికల కోడ్ అమలుపై కీలక సూచనలు చేసింది.

మిగతా 2లో..

## వీడని ఉత్కంఠ..!

- స్థానిక సంస్థల ఎన్నికలు
- బీసీ రిజర్వేషన్ల అంశం
- హైకోర్టులో విచారణ వాయిదా
- బుధవారం సుదీర్ఘ వాదనలు
- జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వం
- అక్టోబర్ 9కి వాయిదా

02



## గ్యాప్ పెరుగుతుంది

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మధ్య దూరం పెరుగుతోంది
- జరుగుతున్న పరిణామాలు స్పష్టం
- రెండో ముఖ్యమంత్రిగా పొంగులేటి
- రేవంత్ అంత స్వేచ్ఛ ఇచ్చారు
- ఇద్దరూ కలిసి కనిపించడం తగ్గింది



02



- పొన్నం ప్రభాకర్
- అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- మధ్య నెలకొన్న వివాదం
- టీపీసీసీ చీఫ్ జోక్యం
- వివాదం సద్దుమణిగింది
- సీఎం దృష్టిసారించారు
- మంత్రులు సమావేశం

## సారీ బ్రో

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల మధ్య నెలకొన్న వివాదం ముగిసింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జోక్యంతో ఈ వివాదం సద్దుమణిగింది. పొన్నం ప్రభాకర్,

మిగతా 2లో..

## ఆరుగురు సజీవ దహనం



02

## డిజిటల్ తెలంగాణ

- గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ
- దేశానికి ఆదర్శంగా రాష్ట్రం
- టీ-ఫైబర్ డిజిటల్ విప్లవం
- కేంద్ర మంత్రి ప్రశంసలు
- డిజిటల్ సమ్మేళనానికి బాటలు
- మంత్రి శ్రీధర్ బాబుకు అభినందనలు
- పకడ్బందీ ప్రణాళికలు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ కనెక్టివిటీని అందించడంలో.. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'టీఫైబర్' ప్రాజెక్టు, దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల డిజిటల్ విప్లవానికి మార్గదర్శిగా మారిందని.. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా ప్రశంసించారు. ఆయన అధ్యక్షతన బుధవారం దిల్లీలో నిర్వహించిన.. స్టేట్ గవర్నమెంట్ ఐటీ మినిస్టర్స్ అండ్ ఐటీ సెక్రటరీస్ రౌండ్ టేబుల్ సదస్సులో.. వినూత్న విధానాలతో డిజిటల్

మిగతా 2లో..

# నేను పోటీ చేస్తా ప్లీజ్

( మొదటిపేజీ తరువాయి )

ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

**గతంలో ఓడిన లంకల దీపక్ రెడ్డి**

ఇకపోతే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తిరిగి లంకల దీపక్ రెడ్డికి ఇస్తేనే సానుభూతి కార్డు వర్కౌట్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అంతేకాదు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లంకల దీపక్ రెడ్డి అత్యంత సన్నిహితుడు. ప్రస్తుతం ఆయన సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

**బరిలో నేనుంటానంటున్న మాధవీలత**

మరోవైపు బీజేపీ నేత మాధవీలత సైతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆసక్తి చూపిస్తున్నారు. అవకాశం ఇస్తే జూబ్లీహిల్‌లో పోటీ చేస్తా... ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉన్నా అని మాధవీలత ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనల వల్ల నష్టం జరిగిందని ఆరోపించారు. ఇప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న అభ్యర్థుల జాబితాలో తన పేరు కూడా ఉందని మాధవీలత వెల్లడించారు.

**సై అంటున్న అన్ని పార్టీలు**

ఇకపోతే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సత్తా



చాటాలని అధికార కాంగ్రెస్, బీజేపీ, సిట్టింగ్ స్థానం కోసం బీఆర్ఎస్ పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమ పనితనానికి రెఫరెండంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఈ సీటు గెలిచి సత్తా చాటాలని కాంగ్రెస్, బీజేపీలు వ్యూహ రచనలు చేస్తున్నాయి. షెడ్యూల్ రావడంతో జూబ్లీహిల్స్‌లో ప్రచారం జోరు మరింత పెరిగింది.ఇకపోతే సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,000 కాగా, జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

# ఆరుగురు సజీవ దహనం

- ఏపీలో భారీ పేలుడు సంభవించింది
- తూర్పు గోదావరి జిల్లాలో ఘటన
- దుర్ఘటనలో ఆరుమంది దుర్మరణం
- ఎనిమిది మందికి తీవ్రంగా గాయాలు
- కొందరి పరిస్థితి విషమంగా ఉంది
- కొమరిపాలెంలో ఈ దుర్ఘటన
- హఠాత్తుగా మంటలు చెలరేగాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తూర్పు గోదావరి జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఆరుమంది దుర్మరణం పాలయ్యారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను చేపట్టారు. గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. జిల్లాలోని బిక్కవోలు మండలం కొమరిపాలెంలో ఈ దుర్ఘటన సంభవించింది. కొమరిపాలెంలో లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్ కంపెనీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. దీపావళి సమీపిస్తోన్న నేపథ్యంలో ఇక్కడ బాణసంచా తయారీ ముమ్మరం



గా చేపట్టారు కార్మికులు. బాణాసంచాను తయారు చేస్తోన్న సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడున్న రసాయనాలు, గంధకం, భాస్వరం.. ఇవన్నీ కూడా మంటలు త్వరగా వ్యాప్తిచెందడానికి దోహదం చేసేవే.

దీంతో మంటలు ఒక్కసారిగా ఫైర్ వర్క్స్ భవనాన్ని చుట్టుముట్టాయి. అగ్నికీలలు శరవేగంగా వ్యాపించాయి. ఆ సమయంలో అక్కడ పలువురు కార్మికులు బాణాసంచా తయారీలో నిమగ్నమై ఉన్నవారు. వారందరూ సురక్షితంగా బయటపడే సమయం కూడా దొరకలేదంటే.. మంటల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మంటల ధాటికి అక్కడ నిల్వ ఉంచిన బాణాసంచా పేలిపోయింది. అనేక మంది కార్మికులు లోపల చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య పెరిగింది.

దీన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. మంటలను ఆర్పివేశారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చాలా కష్టంగా మారాయని పోలీసులు తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు, అత్యవసర సిబ్బంది ప్రస్తుతం సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

క్షతగాత్రులను రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కనీస భద్రతా చర్యలు కొరవడటం, రసాయనాలను సరిగ్గా క నిల్వ ఉంచకపోవడం వల్ల ఈ పేలుడు సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దుర్ఘటన పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆదేశించారు.

# పిడుగు పడి విద్యార్థి మృతి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



పిడుగు పడటంతో విద్యార్థి మృతి చెందిన సంఘటన యాచారం మండలంలోని నల్లవెల్లి, గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జోగు మనిష్, (12) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు పాఠ్య పుస్తకాలను ఇంటిలో పెట్టి పక్కనే ఆడుకుంటుండగా ఒక్కసారిగా ఉరుములతో పిడుగు పడడంతో కింద పడిపోయాడు. స్థానికులు గమనించి విద్యార్థి తల్లిదండ్రులకు తెలపడంతో చికిత్స కోసం పీపుల్స్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు మృతి చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నేడే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్

( మొదటిపేజీ తరువాయి )

ఎన్నికల నిర్వహణకు తాము పూర్తిగా సంసిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్లు ఈసీకి నివేదించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం.. గురువారం ఉదయం 10:30 గంటల నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఈ రెండు స్థానాలకు ఎన్నికలైన తర్వాత.. తదుపరి దశలో సర్పంచ్ , వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం ఈ ఎన్నికలు ఐదు దశల్లో జరగనున్న సంగతి తెలిసిందే. అలాగే మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 17న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత నోటిఫికేషన్ జారీ చేస్తుంది ఎన్నికల కమిషన్. అక్టోబర్ 17 నుంచి 19 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 31న తొలి విడత పోలింగ్, ఫలితాలు ఉంటాయి. ఇక, అక్టోబర్ 21న రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రెండో విడతలో అక్టోబర్ 21న నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ.. నవంబర్ 4న రెండో విడత పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలు విడుదల చేస్తారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు అక్టోబర్ 25న నోటిఫికేషన్ ఇచ్చి.. అక్టోబర్ 25 నుంచి 27 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు నవంబర్ 8న పోలింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. అయితే, తెలంగాణ హైకోర్టు స్టే కారణంగా 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలు, 246 వార్డులకు ఎన్నికలు వాయిదా పడ్డాయి.

# గ్యాప్ పెరుగుతుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మధ్య దూరం పెరుగుతోందని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇటీవలి కాలం వరకు ఎప్పుడూ పొంగులేటి పక్కనే ఉండేవారు. ఒకరకంగా రెండో ముఖ్యమంత్రిగా పొంగులేటి ఉన్నారని అందరూ అనుకునేవారు.



ఆయనకు కూడా సీఎం రేవంత్ అంత స్వేచ్ఛ ఇచ్చారు. అయితే క్రమేణా ఈ ఇద్దరు నేతల మధ్య దూరం పెరుగుతోందంటూ వార్తలు వచ్చాయి. ఇద్దరూ కలిసి కనిపించడం కూడా తగ్గింది. వీటికి బలం చేకూర్చేలా ఓ సంఘటన చోటుచేసుకుంది. తాజాగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు అనారోగ్యంగా ఉండటంతో పరామర్శించడానికి రేవంత్ బెంగళూరు వెళ్లివచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గురించి, అభ్యర్థి గురించి చర్చించారు. రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత పొంగులేటి బెంగళూరు వెళ్లారు. సహజంగా ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కూడా కలిసి వెళతారు. కానీ పొంగులేటి అలా వెళ్లకపోవడంపై కాంగ్రెస్ పార్టీలోనే గుసగుసలు ప్రారంభమయ్యాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రితో ఉన్న సన్నిహితత్వాన్ని ఆసరా చేసుకొని దాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలే గతంలో ఆరోపణలు గుప్పించారు. ఆ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి రెవెన్యూ మంత్రి ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. ఏ కార్యక్రమంలో కూడా ముఖ్యమంత్రితో కలిసి కనిపించడంలేదు. పొంగులేటి కూడా ఖర్గేతో రాజకీయాలు చర్చించి వుంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాత్రం ఆయన రాజకీయం చేయరు. అధిష్ఠానం సీఎంకు గట్టి మద్దతుదారుగా ఉంది. అయితే భవిష్యత్తులో చోటుచేసుకోబోయే పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చే ఫలితాలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలాంటివాటిని బేరీజు వేసుకొని పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయం మారే అవకాశం ఉండొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే ఏం జరుగుతుందో తెలియాలంటే కొంతకాలం వేచిచూడక తప్పదు. మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలంగాణ సర్కార్ లో కీలకమైన మంత్రిగా కొనసాగుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తర్వాత ఎక్కువ వ్యవహారాలను ఈయనే చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో పొంగులేటిని గతంలో ఈడీ టార్గెట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కర్ణాటకలో కూడా బీజేపీ ఇదే తరహాలో వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డీకే శివ కుమార్‌పై కూడా ఇలాంటి దాడులే జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. గతంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కూడా కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఇదే తరహాలో ఈడీ దాడులు చేయించింది. ఈ క్రమంలో తెలంగాణలో పొంగులేటిని టార్గెట్ చేయడంతో ఏదైనా రాజకీయం ఉందా అన్న చర్చ జరుగుతోంది. కేవలం ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలను టార్గెట్ చేయడం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందని కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే మోదీ సర్కార్ సోదాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఐటీ, సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు ఏజెన్సీలను తన రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వాడుకుంటోందంటూ ఆరోపిస్తోంది. మొత్తంగా మంత్రి పొంగులేటి నివాసంపై ఈడీ రైడ్స్‌పై కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో బీజేపీ సర్కార్ తీరును ప్రజాక్షేత్రం ఎండగట్టాలని ఆ పార్టీ ఆలోచిస్తున్నట్టు సమాచారం.

# వీడని ఉత్కంఠ..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. బుధవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగినప్పటికీ... హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణను గురువారం (అక్టోబర్ 9)వాయిదా వేసింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటకు విచారణ చేపట్టనున్నట్టుగా ధర్మాసనం తెలిపింది. అయితే రాష్ట్ర ఎన్నిక సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం... రేపు రాష్ట్రంలో తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి హైకోర్టు ఎలాంటి కామెంట్ చేయలేదు. అలాగే స్థానిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ కానుందని... దీనిపై స్టే ఇవ్వాలని పిటిషన్ తరపు న్యాయవాదులు కోరారు. పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. అయితే హైకోర్టు గురువారం రోజున బీసీ రిజర్వేషన్ల అంశం ఎలాంటి ఆదేశాలు ఇస్తుందనే ఉత్కంఠ మరింతగా పెరిగింది. వివరాలు... బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9ని సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అలాగే బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావుతో పాటు పలువురు బీసీ నేతలు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. ఇందుకు సంబంధించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు విక్రమ్‌రెడ్డి, మయూర్ రెడ్డి తమ వాదనలు వినిపిస్తూ... ఆగస్టు 31 బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందిందని, అయితే బిల్లు ఇంకా చట్టంగా మారలేదని కోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉందా? అని సీజే ధర్మాసనం ప్రశ్నించగా.. అందుకు న్యాయవాదులు అవునని సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లపై ఇచ్చిన జీవో నెం.9తో పాటు జీవో నెం. 41ను కూడా తాము చాలెంజ్ చేస్తున్నామని చెప్పారు. రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా 50 శాతానికి మించరాదన్నారు.

గతంలో మహారాష్ట్రలో కూడా ఇదే తరహాలో పరిణామాలు చోటుచేసుకున్నాయని... రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సుప్రీం కోర్టు కొట్టేసిందని అన్నారు. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీం కోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయని వాదనలు వినిపించారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదని అన్నారు. బీసీ కుల గణన చేశారని... ఆ డేటాను బహిర్గతం చేయలేదని వాదనలు వినిపించారు. బీసీ కులగణన ఆధారంగా 42శాతం రిజర్వేషన్లు అంటున్నారని... కానీ ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు మాత్రం 2011 జనాభా ఆధారమని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? ఆ లెక్కలు ప్రభుత్వం వద్ద లేవని అన్నారు. భోజన విరామం అనంతరం ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. లక్ష మంది ఎన్యుమరేటర్లు సమగ్రంగా కులగణన సర్వే నిర్వహించారని చెప్పారు. ఈ సర్వేలో రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నట్టుగా తేలిందని తెలిపారు. కులగణన చేసి, అన్ని లెక్కలు తీసి రిజర్వేషన్లు అమలు చేస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. కుల గణన తర్వాత ఏకసభ్య కమిషన్‌ను కూడా నియమించారని తెలిపారు. ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించారని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతం కంటే ఎక్కువగా పెంచవచ్చని వాదించారు. బీసీ రిజర్వేషన్ బిల్లును



అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని తెలిపారు. బిల్లులు పాస్ చేసే విషయంలో చట్టసభల్లో భిన్నాభిప్రాయాలు, గొడవలు ఉంటాయని... కానీ ఈ బిల్లును అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలిపాయని, ఏకాభిప్రాయంతో ఆమోదించి పాస్ చేశాయని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని సుప్రీం కోర్టు ఆదేశమే తప్ప... రాజ్యాంగంలో ఎక్కడ కూడా నిబంధన లేదని అన్నారు. డేటా ఆధారంగా ప్రభుత్వానికి, శాసనవ్యవస్థకు తగిన నిర్ణయం తీసుకునే అధికారం ఉందని అన్నారు. చట్టాన్ని సవాల్ చేయకుండా, కేవలం ఆ చట్టం ఆధారంగా జారీ చేసిన జీవోపై మాత్రమే అభ్యంతరాలు చెబుతూ పిటిషనర్ల వాదనలు జరిగాయని అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. జీవో నంబర్ 9పై స్టే ఇవ్వాలని కోరడం సరికాదని అన్నారు. కులగణన సర్వే ప్రకారమే ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. 97 శాతం ఇంటింటి సర్వే జరిగిందని అన్నారు. ప్రభుత్వం పంపిన బిల్లును గవర్నర్ ఇప్పటివరకు ఆమోదించలేదని, అలాగే తిరస్కరించలేదని, తిప్పి పంపలేదని అన్నారు. గవర్నర్లు బిల్లులపై నెలల తరబడి ఎలాంటి నిర్ణయం చెప్పడం లేదని తెలిపారు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలు చేసే చట్టాలను ఆమోదించకపోతే ఎలా అని అడిగారు. ఆర్టికల్ 200ను గవర్నర్లు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తరపున పూర్తి వాదనలు సమర్పిస్తామని... పూర్తి వాదనలు విన్న తర్వాతనే జీవో నంబర్ 9పై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# సారీ బ్రో

( మొదటిపేజీ తరువాయి )

అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లపై చెలరేగిన వివాదం మంగళవారం నాటకీయ మలుపు తిరిగింది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై దృష్టిసారించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు సూచించారు. ఈ క్రమంలోనే మహేష్ కుమార్ గౌడ్ బుధవారం రోజున తన నివాసంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్... ఇరువురు నేతల మధ్య సయోధ్య కుదిర్చారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ... తాను అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఏం అనలేదని, అయితే పత్రికల్లో వచ్చిన వార్తలతో ఆయన బాధపడిన దానికి క్షమాపణలు కోరుతున్నట్టుగా చెప్పారు. సామాజిక న్యాయం అంటేనే కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగిన తాను గానీ, మంత్రి లక్ష్మణ్ కుమార్ గానీ... పార్టీ సంక్షేమం తప్ప ఎటువంటి దురుద్దేశం లేదని చెప్పారు. తాను ఆ మాట అనకపోయినా పత్రికల్లో వక్రీకరించిన దాని ప్రకారం ఆయన బాధ పడిన దానికి క్షమాపణలు కోరుతున్నట్టుగా తెలిపారు. తనకు అలాంటి ఆలోచన లేదని, తాను ఆ ఒరవడి లో పెరగలేని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తనకు ఆ సంస్కృతి నేర్పలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పోరాటం జరుగుతుందని తెలిపారు. తామంతా ఐక్యంగా భవిష్యత్‌లో సామాజిక న్యాయం కోసం పని చేస్తామని తెలిపారు. మంత్రి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్తున్నానని చెప్పారు. కరీంనగర్‌లో మాదిగ సామాజిక వర్గం, తామంతా కలిసి పెరిగామని తెలిపారు. ఎలాంటి అపోహ ఉండవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్టుగా పేర్కొన్నారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశం ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మరో మంత్రి వివేక్ వెంకటస్వామితో మాట్లాడుతూ... "మనకు టైమ్ అంటే తెలుసు, జీవితం అంటే తెలుసు... వాడొక దున్నపోతు, వాడికి ఏం తెలుసు?" అని అనడం వినిపించింది. అయితే పొన్నం ప్రభాకర్ ఎవరిని ప్రస్తావిస్తున్నారనేది స్పష్టంగా తెలియకపోయినా... ఈ అభ్యంతరకరమైన మాటలు మంత్రి లక్ష్మణ్‌ను ఉద్దేశించే చేశారని సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే ఆ ఊహాగానాలను ఖండించారు. తాను అడ్లూరి లక్ష్మణ్ గురించి మాట్లాడలేదని తెలిపారు. అయితే ఈ పరిణామాల నేపథ్యంలో పొన్నం ప్రభాకర్‌పై అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు. తాను పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంతో మాట్లాడనని చెప్పారు. తన దగ్గర డబ్బు లేదని... కానీ తనకు పార్టీపై నమ్మకం ఉందని తెలిపారు. ఆయన తన తప్పును గ్రహిస్తారని నమ్ముతున్నానని... తాను కాంగ్రెస్ నీతి, సిద్ధాంతం, జెండాను నమ్మే వ్యక్తినని తెలిపారు. తాను మంత్రి కావడం, తమ సామాజిక వర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. పొన్నం తన తీరు మార్చుకోకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# కిరాయి కూడా కట్టలేవా రేవంత్?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాడని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల భవనాలకు ఏకంగా ఏడాది కాలం నుంచి అద్దె బకాయిలు చెల్లించకపోవడాన్ని తప్పుబట్టారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ అత్యుత్తమ వ్యవస్థను కుప్పకూల్చి కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలన్న కుట్రలో భాగంగానే రేవంత్ రెడ్డి ఇదంతా చేస్తున్నట్టు అనుమానం కలుగుతోందని వెల్లడించారు. తెలంగాణ సంక్షేమ గురుకులాలకు అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో భవన యజమానులు తాళాలు వేస్తుండడంపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిపై 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె బకాయిలు పేరుకుపోయి చివరికి భవనాలకు తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, దీనికి రేవంత్ రెడ్డి అసమర్థత, చేతకానితనానికి నిదర్శనమని మండిపడ్డారు.

ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెడుతున్న రేవంత్ రెడ్డి.. సంక్షేమ గురుకులాలను కూడా సమాధి చేసే పన్నాగం చేస్తే సహించే ప్రసక్తే లేదని రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ఈ విషయం రేవంత్ రెడ్డి గుర్తు



పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. రెండేళ్లు నిండకుండానే రూ.రెండున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ రెడ్డి, కనీసం గురుకులాల కిరాయి కూడా కట్టకుండా, ఆ సొమ్ముతో ఎవరి జేబులు నింపుతున్నాడో తక్షణమే లెక్కలు చెప్పాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్రంలోని అన్ని గురుకుల భవనాల అద్దె బకాయిలను విడుదల చేసి విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకులాలకు తాళాలు వేసే దుస్థితే వస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి నిరంకుశ రేవంత్ రెడ్డిపై సమరశంఖం పూరిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. చిన్నారుల భవితవ్యంతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం చెబుతామని ప్రకటించారు.


# డిజిటల్ తెలంగాణ

( మొదటిపేజీ తరువాయి )

సమ్మేళత్వానికి తెలంగాణ బాటలు వేస్తుందంటూ.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ప్రత్యేకంగా అభినందించారు. లాస్ట్‌మైల్ ఫైబర్ కనెక్టివిటీ గ్రామీణ సమూహాలను ఎలా మార్చగలదో.. తెలంగాణ చేసి చూపించిందని కొనియాడారు. టీఫైబర్ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాలకు కూడా సహకారం అందించాలని కోరారు. ఈ పైలెట్ ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. డిజిటల్ సమానత్వం సమ్మిళిత వృద్ధికి పునాది. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నాం" అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భావితరాల కోసం పటిష్ఠమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను నిర్మిస్తోందని ఆయన వివరించారు. "టీఫైబర్ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలకు తక్కువ ఖర్చుతో హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తున్నాం. దీని ద్వారా ప్రజలకు ఈగవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ వ్యవస్థాపకత వంటి సేవలు మరింత సమర్థవంతంగా చేరుతున్నాయి అని చెప్పారు.

టీఫైబర్ ప్రాజెక్టు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా, భారత్ నెట్ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. భారత్ నెట్ అమలులో వేగం పెంచాలని, రైట్ ఆఫ్ వే సవాళ్లను పరిష్కరించాలని, సైబర్ భద్రతా ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయాలని" ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాల్లో రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది అని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో టీఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ఇతర రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ డిజిటల్ సమ్మిళత్వ మోడల్ భారతదేశంలో గ్రామీణ అభివృద్ధికి ఒక కొత్త దిశను చూపుతోందని అన్ని రాష్ట్రాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# వధూవరులను ఆశీర్వదించిన జక్కిడి శివ చరణ్ రెడ్డి



**యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు**

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

శంషాబాద్‌లోని కే ఎల్ సి సి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రోజు జరిగిన బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి మేనల్లుడు అనిల్ కుమార్ రెడ్డి తనుశ్రీ వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో సాగాలని కోరుకున్నారు.

# కాంగ్రెస్ నయవంచనపై బాకీ కార్డు ఉద్యమం

**విశాలభారతి:**

కాంగ్రెస్ నయవంచన పై బాకీ కాడ ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాల పైన బాకీ కార్డు ఉద్యమాన్ని ఎమ్మెల్యే బండారీ లక్ష్మారెడ్డి మల్లాపూర్ లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసం చేస్తుందనారు. ప్రభుత్వంలోకి వచ్చిన 100 రోజులలో హామీలన్నీ నెరవేరుస్తానని చెప్పి పడకుండా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్



రెడ్డి, ప్రభుదాస్, శాంతి సాయి జెన్ శేఖర్, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, బిఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# గోడు వినేదెవరు.. గోస తీర్చేదేవరు?

- బతుకు భారంగా పార్ట్ టైమ్ టీచర్లు
- మూడు నెలలుగా జీతాల్లేవ్
- దసరా పండుగ పూట పస్తులే..?
- సమాన పనికి సమాన వేతనం" వట్టి మాటలే
- జీతభత్యాల్లోనూ వివక్షే!?
- పరీక్షల వేళ రానున్న ఫలితాలకు బాధ్యులెవరు?

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

"తమ సోమ జ్యోతిర్గమయా" చీకట్లో నుంచి వెలుగులోకి అన్నట్లుగా విద్యార్థుల జీవితాల్లో వెలుగులను నింపుతున్నా గురుకుల టీచర్ల బతుకులు మాత్రం ఇంకా చీకట్లోనే మగ్గుతున్నాయి. తరగతి గదుల్లో నిత్యం విద్యార్థుల రాతల్ని మార్చుతున్నా పార్ట్ టైమ్ ఉపాధ్యాయుల తలరాతలు మాత్రం ఇంకా మారడం లేదు. నిరుపేద ఉపాధ్యాయులు ఒక్కొక్కరు తమ కుటుంబానికి దూరంగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ రాత్రింబవళ్లు పాఠశాలను అంటిపెట్టుకున్నా "బతుక లేక బడి పంతుళ్లు" అన్నట్లుగా తయారయ్యింది గురుకుల పార్ట్ టైమ్ టీచర్ల దుస్థితి. రెగ్యులర్ వాళ్ళతోనూ సమంగా విధులు నిర్వహిస్తున్నా, చాలీ చాలని జీతాలు ఇస్తున్నా ... ఆ జీతాలు సైతం సమయానికి రాకపోవడం వల్ల "పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందం"గా బతుకులు మారుతున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టీచర్ల పరిస్థితి పరిశీలిస్తే**

తెలంగాణ రాష్ట్రంలో సుమారు 268 సాంఘీక సంక్షేమ గురుకులాల్లో 3,733 మంది పార్ట్ టైమ్ టీచర్లు, మరి కొందరు గెస్ట్ ఫ్యాకల్టీతో కలిపి మొత్తం 4 వేల మంది ఉపాధ్యాయులు తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తోంది. అందులో మొదటగా అకడమిక్ ప్రారంభంలో జూన్ నెల 15 రోజుల జీతం మాత్రం ఇచ్చారు. ఇంకా జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు 3 నెలల జీతాలు రావాల్సి ఉంది. రాష్ట్రంలో ఘనంగా నిర్వహించే దసరా పండుగకు కనీసం పిల్లలకైనా కొత్త బట్టలు కొనలేని దుస్థితిలో ఇబ్బందులు పడ్డామని కొందరు టీచర్లు వాపోతున్నారు. మా ఉద్యోగాన్నీ నమ్ముకుంటే దసరా పండుగకు కూడా ఇంటిల్లిపాది పస్తులుండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలవారీగా జీతం వస్తేనే గడిచే నిరుపేద కుటుంబాలు మూడు నెలలుగా అగమ్య గోచరంగా మారాయి.

**జీతభత్యాల్లోనూ చిన్న చూపే**

రాష్ట్రంలో 5 రకాల సొసైటీలున్నాయి. జ్యోతి రావ్ పూలే బీసీ, ట్రైబల్, మైనార్టీ, జనరల్ గురుకులాలతో పోల్చితే సాంఘీక సంక్షేమ గురుకులంలో మాత్రమే జీతాలు తక్కువ ఇస్తున్నారు. 5 రకాల గురుకులాల్లో ఉమ్మడి సమయ పాలన, పని విధానం అమలు చేస్తున్నప్పటికీ జీతాల విషయంలో ఇంకా వివక్షతను ఎదుర్కొంటున్నారు. మైనారిటీ గురుకులంలో జూనియర్ లెక్చరర్లకు నెలవారీ జీతం రూ.36 వేలు, పీజీటీ లకు జీతం రూ.29 వేలు కాగా సాంఘీక సంక్షేమ గురుకుల జూనియర్ లెక్చరర్లకు మాత్రం రూ.23 వేలు, పీజీటీ లకు రూ.18 వేలు మాత్రమే ఇవ్వడం వివక్ష కాదా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికైనా పరిష్కరించేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇప్పటికైనా జరిగిన పొరపాటును సరిచేసి ప్రతి నెలకు రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటుగా నేరుగా పార్ట్ టైమ్ ఉపాధ్యాయుల ఖాతాల్లో నే నెలవారీ జీతాలు వేయాలని అధికారులను, ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

**అశాస్త్రీయంగా పనివేళలు**

అన్ని గురుకులాల్లోనూ పనివేళలు కూడా అశాస్త్రీయంగా ఉన్నాయి. ఉదయం 8 గంటలకు పాఠశాలకు వెళితే 4:30 వరకూ స్కూల్, ఇందులో సూపర్ విజన్, రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్స్, వారానికి ఒక్కో రోజు స్టే పేరిట అక్కడే పడుకోవాల్సి వస్తుంది. అంటే సుమారు 25 30 కిలో మీటర్ల నుంచి బయలుదేరే టీచర్ ఇంటి నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరితే రాత్రి 9గంటలకు స్టడీ ముగిసాక ఇంటికి చేరే సరికి రాత్రి 10 అవుతోంది. అంటే సుమారు రోజుకు 24 గంటల్లో 15 గంటలు పాఠశాలలోనే గడపాల్సి వస్తుంది. వీటికి తోడు నిత్యం రికార్డుల పేరిట ఏదో రకంగా పని ఉండే ఉంటుంది. ఒకవైపు చాలీ చాలని జీతాలు, మరో వైపు అధికంగా పని భారం ఉన్నా కుటుంబాలను గడపడానికి ఆధారంగా ఉన్నటువంటి ఈ గురుకులంలో ఉద్యోగాలు చేస్తూ నానా అవస్తలు పడుతున్నామని కొందరు ఉపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికైనా పని వేళలు విద్యార్థుల, సిబ్బంది మానసిన వికాసానికి, సంసిద్ధతకు సరిపోయే విధంగా ఉండేలా చూడాలని అభ్యర్థిస్తున్నారు.

**పట్టించుకొని అధికారులు సంఘాలు**

సాంఘీక సంక్షేమ గురుకులాల్లో రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి కూడా కింది స్థాయి నుంచి వెళ్లిన వారే. కింది స్థాయి ఉద్యోగుల బాధలు, వ్యధలు తెలిసినవారే. అయినప్పటికీ ఎవరూ వారి పట్ల సానుకూలంగా పని చేయడం లేదనీ పార్ట్ టైమ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు సైతం ప్రత్యేకంగా దృష్టి సారించడం లేదని, చిన్న చిన్న ప్రకటనలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాయని పార్ట్ టైమ్ టీచర్లు చెబుతున్నారు.




## గోస తీర్చండి

ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని పార్ట్ టైమ్ టీచర్లకు జీతాలు నెలవారీగా సకాలంలో అందేలా చూడాలనీ, ప్రిన్సిపాల్ ఖాతాలో కాకుండా వీలైతే నేరుగా ఉపాధ్యాయుల ఖాతాల ద్వారానే జీతాలు అందజేయాలని కోరుతున్నారు. పని వేళలను సైతం సాధ్యమైనంత త్వరగా మార్చాలని కోరారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల మానసిక, శారీరక సంసిద్ధతకు, వికాసానికి అనుగుణంగా సమయ పాలనను మార్చాలని అభిలషిస్తున్నారు. తమ బతుకులన్నీ ఇంకా ప్రశ్నార్థంకంగానే మిగిలిపోకుండా తమకు తగిన విధంగా న్యాయం చేస్తారని పార్ట్ టైమ్ ఉపాధ్యాయ వర్గాలు కోరుకుంటున్నాయి. రానున్న రోజుల్లో అన్ని రకాలుగా న్యాయం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బాకీ కార్డుల పేరుతో బీఆర్ఎస్ కొత్త నాటకం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు ఏం ఓరగబెట్టారని ప్రశ్న
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుణపాఠం తప్పదు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



బాకీ కార్డుల పేరుతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త నాటకానికి తెరలేపారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉండి ఇంటికొక ఉద్యోగం, దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ లు, కేజీ టు పీజీ విద్య, పోడు భూముల పట్టాలు, అమరుల కుటుంబాలకు ఉద్యోగం, ముస్లిం లకు రిజర్వేషన్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో హామీలు ఇచ్చారని, అవన్నీ అమలు చేశారో లేదో చెప్పాలని నిలదీశారు. ఏ పార్టీ అయినా ఎన్నికల ముందు ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయాలని ఉద్దేశంతోటే ఇస్తారన్నారు. మిగులు రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అవినీతికి పాల్పడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ ఒక్కొక్కటిగా హామీలు అమలు చేస్తున్న క్రమంలో పాలనలో కనీసం రెండేళ్లు పూర్తికాకుండానే తమ ఉనికి కోసం బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 22 నెలల కాలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతులకు రుణ మాఫీ, సన్నాలకు బోనస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్ కనెక్షన్, సుమారు 60 వేల ఉద్యోగ కల్పన, రేషన్ కార్డుల పంపిణీ హామీలు అమలు అవుతున్నాయని, మేనిఫెస్టోలో లేని రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ పథకం సైతం అమలు జరుగుతుందని, ఈ పథకాలు బీఆర్ఎస్ నాయకులకు కూడా లబ్ధి పొందారని. అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

# మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా ఎక్సైజ్ సిఐ జి.చిరంజీవి ప్రకటన.
- రెండు సంవత్సరాల కాలానికి లాటరీ విధానం

**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:**



జిల్లా ప్రజలు గమనించగలరు... రెండు వేల ఇరవై ఐదు నుండి రెండు వేల ఇరవై ఏడు వరకు రెండేళ్ల కాలపరిమితికి మద్యం దుకాణాల లైసెన్సులను లాటరీ విధానంలో జారీ చేయనున్నాం" అని జిల్లా ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటనలో మాట్లాడుతూ, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్దేశిత పత్రాలతో పాటు దరఖాస్తులను అక్టోబర్ పదెనిమిదవ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా సమర్పించాలని సూచించారు. చిరంజీవి వివరించిన ప్రకారం, దరఖాస్తు రుసుము మూడు లక్షల రూపాయలు. ఈ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చలాన్ రూపంలో జిల్లా ఎక్సైజ్ అధికారి పేరిట చెల్లించవలసి ఉంటుంది. చలాన్ చెల్లింపుకు సంబంధించి ప్రభుత్వ ఖజానా శాఖ నిబంధనలను తప్పక పాటించాలని ఆయన సూచించారు. దరఖాస్తుతో పాటు పూరించిన దరఖాస్తు పత్రం, మూడు పాస్‌పోర్ట్ పరిమాణం లోని ఫోటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు ప్రతులు, మూడు లక్షల రూపాయల చలాన్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రశీదు తప్పనిసరిగా జత చేయాలి. అదనంగా గౌడ్, అనుసూయిత జాతులు, అనుసూయిత తెగలు మరియు ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు తమ కుల ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులు జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయం, IDOC సముదాయం, మహబూబాబాద్‌లో స్వీకరించబడతాయని చెప్పారు. మరిన్ని వివరాల కోసం మహబూబాబాద్, గూడూరు, తొర్రూరు ప్రాంతాల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లను సంప్రదించవచ్చని జి.చిరంజీవి తెలిపారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సంసిద్ధంగా ఉంటా

**తోకల శ్రీనివాస్**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**

రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని శాంతినగర్ మరియు వాసవి కాలనీలో మొన్న కురిసిన ఆకాల వర్షానికి ఇళ్లలో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి మరియు హెచ్ఎం డబ్ల్యూఎస్ ఎస్ బి అధికారులతో కలిసి బస్తి లో పర్యటించడం జరిగింది. అదే విధంగా భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పైపులైన్ కోసం కాలనీలో అధికారులతో కలిసి పర్యటించడం జరిగింది. భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పైప్ లైన్ వ్యవస్థ పూర్తి సాయి మెరుగుపరచలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే విధంగా వీలైనంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా దగ్గర ఉండి వర్షపు నీటిని హైడ్రా సిబ్బంది, మాన్సూన్ సిబ్బందికి మళ్లించే విధంగా పలు సూచనలు చేయడం జరిగింది. అదే విధంగా అవసరమైతే హైడ్రా సిబ్బందితో వేగవంతంగా వర్షపు నీటిని తొలగించే విధంగా పనులను వేగ వంతం చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో మన్మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, రఘు, మహమ్మద్ షకీల్, మజర్, అడికే శివ, హనుమంత్ రెడ్డి, జిహెచ్ఎంసి ఏఈ నరసింహ మూర్తి, హరీష్, ఎస్ ఎఫ్ ఏ జగన్ బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

బండ్లగూడ జాగీర్ మున్సిపాల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ గ్రామంలో అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు చరణ్ (బాబీ) తో కలిసి పరిశీలించిన మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి. భవన నిర్మాణాన్ని పూర్తి చేయుటకు తగిన నిధులు మంజూరు చేయాలని ఈరోజు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని కోరడం జరిగింది. ఎమ్మెల్యే స్పంధించి అంబేద్కర్ భవన్ నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేసి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ శరత్ చంద్రకి అదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంబేద్కర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చరణ్ (బాబి), ప్రధాన కార్యదర్శి రాహుల్ మరియు అసోసియేషన్ సభ్యులు, గౌతమ్ రాజ్, అవినాష్, ప్రదీప్, అభిషేక్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.



# జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**దేవరుప్పల, విశాలభారతి :**



డా" రాపాక శ్రీశైలం ( బిఎస్పి) జిల్లా సీనియర్ నాయకులు ( సామాజిక కార్యకర్త ) దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై సనాతన ధర్మం ముసుగులో జరిగిన మనువాద దాడిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.ఈ దాడి దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజు.భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత,లౌకిక ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే పార్టీ భావిస్తుంది. ఈ దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ,ఆధిపత్య కులాల నుండి అవమానాలు మాత్రం తప్పడం లేదు.దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జస్టిస్ బి.ఆర్.గవాయిపై జరిగిన దాడి. ఈ దేశంలో వేల ఏళ్లుగా అవమానాలకు గురవుతున్న జాతులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారం దక్కాలి. రాజ్యాధికారం దక్కనంతకాలం మన జాతులకు అవమానాలు, అణిచివేతలు, దాడులు తప్పవు.ఈ దేశంలో రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఎంతటి ఉన్నత స్థాయి పదవులు అనుభవించిన సరే,వాళ్ళకు ఆత్మగౌరవం,రక్షణ రెండూ ఉండవు. ఇంతకాలం అవమానాలు, అణిచివేతలకు గురైన వర్గాల ప్రజలే ఇప్పుడు దేశాన్ని పాలించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే మన జాతులకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం దక్కుతుంది. డా.బి.ఆర్ అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికార సాధన కోసం మాన్యవర్ కాన్షీరామ్ బీఎస్పీని స్థాపించారు, ఉత్తర్ ప్రదేశ్ లో దళితులకు రాజ్యాధికారం దక్కేలా కృషి చేశారు. బెహన్ కుమారి మాయావతి ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనువాదులతో అహర్నిశలు పోరాటం చేస్తున్నారు. అందుకే ఎన్నికలు ఏవైనా... ఏనుగు గుర్తుకు ఓట్లేసి, బీఎస్పీని గెలిపిద్దాం! ఆత్మ గౌరవంతో బతుకుదాం!! జస్టిస్ బి.ఆర్.గవాయికి బీఎస్పీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంది.

# విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో హార్ధిక సాయం



**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని శ్రీ విశ్వకర్మ మనుమయ్యలో సంఘ సభ్యుడైన పోలోజు మల్లయ్య చారి కి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకోని శ్రీ విశ్వకర్మ మనుమయ సంఘం నుండి 4000 ఆర్థిక సాయం సంఘం అధ్యక్షులు పంతంగి మదనాచారి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా విశ్వకర్మలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాలు విశ్వకర్మలను ఆదుకోవాలని వృత్తిని నమ్ముకొని జీవనాధారం చేసే విశ్వకర్మలని ఆర్థిక చేయూతని ఇచ్చి ప్రోత్సహించాలని ముందు తరాలకు వృత్తి చేయాలంటే ప్రభుత్వాలు విశ్వకర్మ ఫెడరేషన్ చేసి విశ్వకర్మలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని,50 సంవత్సరాలు నిండిన ప్రతి విశ్వకర్మకు పింఛన్ ఇవ్వాలని సంఘ అధ్యక్షుడు కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో కార్యదర్శి శశిభూషణ్ చారి, గౌరవాధ్యక్షులు శానకొండ రాజు చారి,మండలోజు బిక్షమాచారి,మల్లయ్య చారి,విశ్వరూప చారి,శ్రీనివాస్ చారి,వీరాచారి మచ్చ గిరి చారి,నరసింహ చారి,శివకుమార్ చారి,లక్ష్మణు,సురేష్ చారి మరియు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరేళ్ల తర్వాత వర్సిటీకి బస్సులు పునః ప్రారంభం

**రాజేంద్రనగర్, విశాలభారతి:**



రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం, కళాశాల, వివిధ కేంద్ర పరిశోధన సంస్థలలో పనిచేసే బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులతో పాటు సందర్శించే రైతులు, సమీప కాలనీలు ప్రేమావతిపేట, బుద్వేల్ తదితర ప్రాంతాల ప్రజలకి 60 ఏళ్లుగా అందుబాటులో ఉన్న ఆర్టీసీ బస్సులను 2019 నాటి వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో అందరూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని నెలల క్రితం ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బస్సుల పునరుద్ధరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు ట్రాఫిక్ సర్వే నిర్వహించారు. దసరా కానుకగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బస్సులు పునః ప్రారంభించనున్నట్లుగా ఆర్టీసీ అక్టోబర్ 1వ తేదీన అధికారిక సమాచారాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులకు అందించింది. బుధవారం రాజేంద్రనగర్ లోని కళాశాల వద్ద బస్సు సర్వీసులను ఉపకులపతి అల్దాస్ జానయ్య, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ, ఆర్టీసీ ఉన్నత అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా 'ఎల్లీ టాట్స్' ప్రీస్కూల్ ప్రారంభం

**జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా రోడ్డులో ఉన్న విఠల్ ఎన్క్లేవ్ కాలనీలో ఎల్లీ టాట్స్ ప్రీస్కూల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి రిబ్బన్ కట్ చేసి, యాజమాన్యంతో కలిసి దీప ప్రజ్వలన చేసి విద్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం ఆధునిక పద్ధతులతో రూపొందించిన ఈ ప్రీస్కూల్ ఒక కొత్త దిశలో ముందడుగు. ఇక్కడ చిన్నారులు కేవలం పుస్తకాల బోధనకే పరిమితం కాకుండా, మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధిని సాధించే విధంగా ప్రత్యేక శిక్షణ పొందుతారు, అని తెలిపారు. పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే విద్య యొక్క నిజమైన లక్ష్యం. అదే దిశగా ఎల్లీ టాట్స్ ప్రీస్కూల్ కృషి చేస్తోంది. చిన్నారి విద్యార్థుల భవిష్యత్తు బాటను పటిష్టంగా వేస్తున్న ఈ సంస్థకు నా ఆశీర్వాదాలు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ డైరెక్టర్ శ్రీమతి నికిత రెడ్డి, కార్తీక్ రాజారెడ్డి, రణధీర్ రెడ్డి, వాణి సులోచన తదితరులు పాల్గొని, పిల్లల అభివృద్ధి దిశగా ప్రారంభమైన ఈ విద్యా ప్రయాణానికి తమ శుభాకాంక్షలు తెలిపారు.





# ఎన్నికల్లో యాదవులకు సీట్లు కేటాయించాలి

**జిల్లా ఉపాధ్యక్షులుఅనుముల సంజీవ్ యాదవ్**

వాజేడు , విశాలభారతి: ములుగు జిల్లా వాజేడు మండలకేంద్రంలో యాదవ మహాసభ ముఖ్య నాయకుల సమావేశంలో సంజీవ్ యాదవ్ మాట్లాడుతూ బిసి లకు రాష్ట్ర ప్రభుత్వం 42%శాతం వాటా ఇస్తున్నట్లు తేల్చి చెప్పింది ములుగు జిల్లా లో యాదవుల జనాభా దామాషా ప్రకారం కాంగ్రెస్, బి ఆర్ ఎస్, బీజేపీ,పార్టీలు సీట్లు కేటాయించి తమ కులానికి రిజర్వేషన్ల లో ప్రాధాన్యత కల్పించాలని సంజీవ్ యాదవ్ డిమాండ్ చేశారు.

# ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలి



- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపు
- మార్నింగ్ వాక్ ద్వార యాచారంలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలను గుప్పించిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే వాటిని విస్మరించిందని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే , బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ.. 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించిందని తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మార్నింగ్ వాక్ ద్వార బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలు చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అన్నీ 420 అని విమర్శించారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయారన్న భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని అన్నారు. అందుకే ప్రజలకు హామీలను గుర్తుచేసేందుకు బాకీ కార్డు ఉద్యమాన్ని చేపట్టినట్టు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 22 నెలల కాలంలో కాంగ్రెస్ సర్కార్ అన్ని వర్గాల ప్రజలకు ఎంతో బాకీ పడిందని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు రూ.2500 తులం బంగారం, స్కూటీ, వికలాంగులకు పెంచుతామన్న పింఛన్లు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణ రెడ్డి ,మాజీ జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, యాచారం మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చ భాష, నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యవత్ రాజు నాయక్, నాయకులు జక్క రామ్ రెడ్డి , బూడిద రామ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి , చిలుకల బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అభ్యర్థులను గెలిపించండి

- ప్రజల హక్కుల కోసం నాలుగు దశాబ్దాలుగా నిరంతర పోరాటం
- మహబూబాబాద్ జిల్లాలో 5 జడ్పిటిసి, 15 ఎంపిటిసి స్థానాలకు పోటీ

**మహబూబాబాద్, విశాలభారతి:**




జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలలో నిజాయితీగా నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థులను గెలిపించాలని బుధవారం జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి, సనప పొమ్మయ్య, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె మదార్ లు పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరగబోతున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో మహబూబాబాద్ జిల్లా లో 5 జడ్పిటిసిలకు, 15 ఎంపీటీసీలకు పార్టీ పోటీలో నిలుస్తుంది. గత 40 సంవత్సరాలకు పైగా ప్రజా సమస్యలపై ప్రజల హక్కుల కోసం సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేయడం జరిగింది. ఈ ఉద్యమాలలో అనేకమంది విప్లవకారులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారి త్యాగాల ఫలితంగానే గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో 10 లక్షల ఎకరాలకు పైగా పోడు భూములను కొట్టించి ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర పార్టీకి ఉందని వారు అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు అనేక సమస్యలు పరిష్కరించడం జరిగింది. నేడు ఎన్నికలు అంటే డబ్బు, మందు, తదితర ప్రలోభాలతో ప్రజలను పాలకవర్గ పార్టీలు మభ్యపెడుతూ అధికారంలోకి వస్తున్నాయి. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధికి పాటుపడే సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీని ఆదరించి పార్టీ అభ్యర్థులను ఎన్నికలలో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల జిల్లా, రాష్ట్ర నాయకులు కే భాస్కర్ రెడ్డి, బండపల్లి వెంకటేశ్వర్లు, ఆరేం కోటమ్మ, ఎస్ కవిత, హెచ్ యాకయ్య, ఇరుగు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమ నిర్మాణాలు కూల్చివేత

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రేపటిన నిర్మాణాలను గండిపేట రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు.. మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగూడలో సర్వే నెంబర్ 290 లోని కొంత భాగాన్ని స్థానికులు కొందరు ఆక్రమించుకొని 6 నిర్మాణాలు నిర్మించారు. బుధవారం తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది జెసిబి లతో వాటిని నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూములు అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.



# కేటీఆర్‌ను కలిసిన పాల్వాయి ప్రవంతి

**మునుగోడు, విశాలభారతి:**

భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాల్వాయి స్రవంతి కేటీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్వాయి వెంకట్ రెడ్డి రాజు శ్యాము శ్రవణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం

**దేవరుప్పల, విశాలభారతి:**

రాబోయే స్థానిక సంస్థల ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో సింగరాజుపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశం గ్రామ కమిటీ అధ్యక్షులు కొండ పెద్ద మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ క్రమంలో దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను గెలిపించుకోవడం మన బాధ్యత. కార్యకర్తల కృషి వల్లే పార్టీ ఈరోజు బలంగా నిలబడింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే ఉత్సాహంతో, ఐక్యంగా పని చేయాలి. ప్రతి గ్రామంలో ప్రజలతో కలసి ఉండి, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి, అని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులందరూ అత్యధిక మెజారిటీతో గెలవాలి. అందరూ కలసికట్టుగా కష్టపడితే పార్టీ ఘనవిజయం సాధిస్తుంది. ప్రజల మద్దతు కాంగ్రెస్ పట్ల పెరుగుతోంది, దాన్ని మరింత బలపరచడం మనందరి బాధ్యత అని అన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నరసమ్మ మృతి పట్ల సంతాపం




**వ్యక్తం చేసిన మండల నాయకులు**

**తిరుమలగిరి, విశాలభారతి:**

మండల పరిధిలో వెలిశాల గ్రామం లో సీనియర్ నాయకులు దుప్పటి యాదయ్య తల్లి దుప్పటి నరసమ్మ మృతి చెందటం తో మండల పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ , జిల్లా నాయకులు సుంకర్ జనార్ధన్ లు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. పార్థివ దేహనికి పూల మాల వేసి నివాళులు అర్పించినారు. వారి వెంట ధూపటి మల్లయ్య, అబ్బాస్, రాము గౌడ్, పత్తేపురం సుధాకర్, రాములు నాయక్, భాస్కర్ నాయక్, రాములు, రాజు నాయక్, వెంకన్న తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



- ఉప్పల శ్రీనివాస్ గుప్త
- ఐవిఎఫ్ మహిళా విభాగ్ నూతన కమిటీ నియామకం

**ఎల్బీనగర్, విశాలభారతి :**

ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా గీత గుప్త iVf పొలిటికల్ చైర్ పర్సన్, ఏపూరీ జయలక్ష్మి, భువన స్టేట్ అడ్వైజర్ గా నియామక పత్రాలు అందజేశారు.బుధవారం నాగోల్ లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో మహిళ విబాగ్ నాయకురాల్లకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా ముందుకు రావాలని ఆయన అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్య వైశ్య మహిళ సోదరీమణులు జెడ్పీటీసీ,ఎంపీపీ లు ,ఎంపీటీసీ, సర్పంచ్ గా పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున మీకు నేను అండగా ఉంటాను అని ఆయన అన్నారు.ఇంటికే పరిమితం కాకుండా వ్యాపారంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలి అని మరెన్నో సేవలు అందించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో IVF ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, మహిళ విభాగం అధ్యక్షురాలు చందా భాగ్య లక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంజుల , కోశాధికారి నళిని , అడ్వై జర్ మనిమల తదితరులు పాల్గొన్నారు.



# మట్టి మాఫియా ట్రాక్టర్ల పట్టివేత

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ బెతోలు సమీ పంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తుండగా పక్కా సమాచారంతో అధికారులు మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈనెల 6న "విశాల భారతి" బెతోల్ లో ఎర్రమట్టి దోపిడీ పై ప్రచురించిన కథనానికి స్పందించిన మహబూబాబాద్ తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్చార్జ్ ఆర్ఐ, జి పి ఓ రాత్రి 11 గంటల సమయంలో కురవి పోలీస్ సిబ్బందితో కలిసి పక్షా సమాచారంతో ట్రాక్టర్లను పట్టుకున్నారు.



రాత్రి సమయంలో మట్టి దళారులు 10 ట్రాక్టర్లతో మట్టి తరలించడం జరిగింది. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో ట్రాక్టర్లు తరలించి చివరకు రెండు ట్రాక్టర్లు మాత్రమే దొరికినట్లు తెలుస్తుంది. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సమాచారం. అవినీతి అక్రమాలను ఎండగడుతూ ప్రజలకు మద్దతుగా నిలుస్తున్న "విశాల భారతి" దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

**కరీంనగర్, విశాలభారతి:**

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల మొదటి విడత నోటిఫికేషన్ నేటి ఉదయం 10:30 గంటలకు విడుదల చేయబడనుంది. ఈ నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 15 జడ్పీటీసీ స్థానాలు, 70 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మొదటి దఫా ఎన్నికలు హుజురాబాద్ రెవిన్యూ డివిజన్‌లోని ఆరు మండలాలు శంకరపట్నం, వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజురాబాద్, వి సైదాపూర్‌లో 6 జడ్పీటీసీ, ఆరు మండలాల్లోని 70 ఎంపీటీసీ స్థానాలకు నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా, నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి 11 వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నది. రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, ప్రతి నామినేషన్ కేంద్రంలో భద్రత కల్పించాలని సూచనలు ఇవ్వబడ్డాయి. నామినేషన్ల పరిశీలన నవంబర్ 12 వరకు పూర్తి చేసి చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా ప్రకటించబడనుంది. ఉపసంహరణకు నవంబర్ 15 వరకు గడువు ఉంటుంది. ఎన్నికల తేదీ అక్టోబర్ 23, ఓట్ల లెక్కింపు నవంబర్ 11న జరుగుతుంది.



# వ్యక్తి కుటుంబానికి ఆర్థికసాయం

**మునుగోడు, విశాలభారతి:**

మండల పరిధిలోని జమస్థాన్ పల్లి గ్రామంలో గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన అందుగుల కుశ కుటుంబానికి డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం ఆర్థిక సహాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్దలు కలిసి వారితో కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంతంగి పద్మ స్వామి, నాయకులు జాజుల స్వామి గౌడ్, జాజుల శంకర్,జీనుకుంట్ల ముత్యాలు, అందుగుల యాదయ్య, జాజుల రవి, తదితరులు పాల్గొన్నారు.

# నూతన డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన క్యామ మల్లేష్

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్, తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బత్తుల శివదర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ క్యామ మల్లేష్ , రాష్ట్ర ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో డీజీపీ నాయకత్వం కీలకమని అభినందిస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాటసింగారం రైతు సహకార సంఘం మాజీ అధ్యక్షులు చేగూరి భరత్ , పార్టీ నాయకులు అధికారులు తదితరులు హాజరయ్యారు.



# రెవెన్యూ దరఖాస్తులు పరిష్కరించాలి

**కలెక్టర్ సత్యప్రసాద్**

**జగిత్యాల, విశాలభారతి:**

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఎమ్మార్వో లను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్లో భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్ఎస్సార్ తేడా ఉన్న సర్వే నెంబర్ల మీద క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సరిచేయాలన్నారు. సాధబైనమా, అసైన్మెంట్ కేసుల్లో ఎంక్వైరీ పూర్తి చేయాలని, కోర్టు కేసుల్లో ఉన్న భూముల విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ, అసైన్డ్, ఇరిగేషన్, భూదాన్, వక్ఫ్, ఎండోమెంట్, శిఖం భూములకు జీఐఎస్ బేస్డ్ సర్వే మ్యాప్ తయారు చేసి సంబంధిత సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. అంతకుముందు ధరూర్ క్యాంపులోని ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి, జగిత్యాల కోరుట్ల, మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.

# బత్తుల విప్లవ గౌడ్ నూతన కారు ప్రారంభోత్సవం




**పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, విశాలభారతి:**

మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్,మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మనవరాలు పుట్టిన సందర్భంగా హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బత్తుల విప్లవ్ గౌడ్, కొనుగోలు చేసిన నూతన వాహనాన్ని ఎమ్మెల్యే తన డ్రైవ్ తో ప్రారంభించి,బత్తుల విప్లవ్ గౌడు కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పాశం సంజయ్ బాబు,చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,నాయకులు కొండూరు వెంకటయ్య,కొయ్యడ సైదులు గౌడ్,కామిశెట్టి భాస్కర్ గుప్తా,అంతటి బాలరాజు గౌడ్,పాక చిరంజీవి,రావుల స్వామి,కొరగోని లింగస్వామి,ఎండి కరీం,తొర్పునూరి రవి గౌడ్,బొంగు శ్రీనివాస్ గౌడ్,కేతరాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూజాహెగ్డే భారీ రెమ్యునరేషన్..
# తెలుగులో మళ్లీ ఫాంలోకి వచ్చేనా..?



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది.తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందట. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.

## మలయాళ నటికి ఊరట..
## ముందస్తు బెయిల్ మంజూరు చేసిన
# కేరళ హైకోర్టు



మలయాళ నటి లక్ష్మీ ఆర్ మీనన్‌కు కేరళ హైకోర్టు ఊరటనిచ్చింది. కిడ్నాప్, దాడికి సంబంధించిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో లక్ష్మీ మీనన్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బెచు కురియన్ థామస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 24న కొచ్చిలోని ఓ పబ్ వద్ద జరిగిన ఘటనలో నటితో పాటు ఇద్దరిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.పబ్ వద్ద లక్ష్మీ మీనన్ గ్యాంగ్, ఐటీ ప్రొఫెషనల్ మధ్య వివాదం జరిగింది. ఎఫ్ఐఆర్ ప్రకారం.. నటి లక్ష్మీ మీనన్, ఆమె స్నేహితులు బాధితుడిని వెంబడించి, ఐటీ ఉద్యోగి కారును అడ్డగించారు. ఆ తర్వాత సదరు వ్యక్తిని బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకొని వెళ్లి అతనిపై పాల్పడ్డారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ 2023 లోని కిడ్నాప్-అపహరణ, బెదిరింపులతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో నటి లక్ష్మీ మీనన్ పేరును సైతం చేర్చారు. వివాదాన్ని సామరస్య పూరక్వంగా పరిష్కరించామని.. ఈ కేసును మరింత ముందుకు తీసుకువెళ్లకూడదని పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో హైకోర్టు నిందితులకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పించింది. కేసు విచారణ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లోని ప్రాథమిక ఆరోపణలు తీవ్రమైన నేరం జరిగినట్లుగా చూపిస్తుందని కోర్టు పేర్కొంది. అయితే, ఈ సమస్య పరిష్కారమైందని, పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంటూ డీ-ఫాక్టో ఫిర్యాదుదారుడు అఫిడవిట్ దాఖలు చేశారని పేర్కొంది.



# ఇది సమష్టి వైఫల్యమే..
## కరూర్ తొక్కిసలాట ఘటనపై రిషభ్ శెట్టి

తమిళనాడులోని కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ చేపట్టిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై కాంతార నటుడు రిషభ్ శెట్టి తాజాగా స్పందించారు. ఇది దురదృష్ట సంఘటనగా అభివర్ణించారు. ఇది ఏ ఒక్కరి వైఫల్యమో కాదని.. సమష్టి పొరపాటుగా పేర్కొన్నారు.ఓ జాతీయ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రిషభ్ శెట్టి మాట్లాడారు.. 'కరూర్ తొక్కిసలాట ఘటన దురదృష్టకరం. ప్రజలు హీరోలను ఆరాధిస్తారు. తమకు ఇష్టమైన హీరో సినిమాలు రిలీజ్ అయినప్పుడు పాలాభిషేకాలు చేస్తారు. ఈ ఘటనపై స్పందించడానికి మాటలు రావడం లేదు. ఇది ఒకరి వల్ల జరిగిందని నేను అనుకోవట్లేదు. ఇది సమష్టి వైఫల్యం కావొచ్చు. ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఘటనలు జరగవు. ఇలాంటి ర్యాలీలు ఉన్నప్పుడు క్రౌడ్ ఎక్కువగా ఉంటుంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసులు, ప్రభుత్వాన్ని నిందించడం సులభమే. కానీ క్రౌడ్‌ని కంట్రోల్ చేయడం అంత ఈజీ కాదు' అని చెప్పుకొచ్చారు. గతనెల 27న కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ (Actor Vijay) నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీ విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. 60 మంది గాయపడ్డారు.

# ఓటీటీలోకి 'వార్ 2'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 09 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది .ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, 'కలి' పేరుతో ఇండియా పతనానికి ప్లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి? 'కలి' వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు? ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.



# పర్సనల్ విషయాలని ఆన్‌లైన్‌లో పంచుకోలేను..



నేషనల్ క్రష్‌గా పేరు తెచ్చుకున్న రష్మిక మందన్న ఈ మధ్య వార్తలలో తెగ నిలుస్తుంది. తాజాగా ఆమె మరోసారి వార్తల్లో నిలిచింది. సినిమాలూ, వ్యక్తిగత జీవితం, సోషల్ మీడియా యాక్టివిటీలతో ఆమె చుట్టూ ఎప్పడూ హడావుడే ఉంటుంది. ఇటీవల ఆమెపై ట్రోలింగ్ తీవ్రంగా పెరిగిపోతున్న నేపథ్యంలో, రష్మిక ఈసారి కాస్త ఘాటుగానే స్పందించింది. ఇటీవల విడుదలైన కన్నడ బ్లాక్‌బస్టర్ 'కాంతార: చాప్టర్ 1' సినిమాపై స్పందించలేదని, కనీసం అభినందనలు చెప్పలేదని కొంతమంది నెటిజన్లు ఆమెపై ట్రోలింగ్ ప్రారంభించారు. "మీ కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన గొప్ప సినిమా గురించి ఒక్క మాట కూడా మాట్లాడడంలేదేంటి?" అంటూ కామెంట్లు పెట్టడంతో ఆమెకి చిర్రెత్తుకొచ్చింది.

ఈ క్రమంలో రష్మిక స్పందిస్తూ .. "ఏ సినిమా అయినా విడుదలైన వెంటనే చూడలేను. కాంతార కూడా విడుదలైన కొన్ని రోజులకి చూసాను. వెంటనే టీమ్‌కి మెసేజ్ చేసి అభినందనలు కూడా తెలియజేశాను. తెర వెనక జరుగుతున్న విషయాలు అందరికీ కనిపించవు కదా. నేను ప్రతీ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకునే వ్యక్తిని కాదు. అందుకే ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను. నా నటన గురించి వాళ్లు ఏం చెప్తారన్నదే నాకు ముఖ్యం," అని తేల్చిచెప్పింది. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె అభిమానులు ఈ పోస్ట్‌కు మద్దతుగా నిలవగా, కొంతమంది నెటిజన్లు ఇంకా విమర్శలు చేయడం కొనసాగిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, రష్మిక ప్రస్తుతం బాలీవుడ్‌లో 'థామా' అనే హారర్ థ్రిల్లర్ సినిమాలో నటిస్తోంది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 21న విడుదల కాబోతుంది. ఈ సినిమాపై రష్మిక చాలా హోప్స్ పెట్టుకుంది. కన్నడ సినిమా ఇండస్ట్రీ నుండి వచ్చిన రష్మిక ఈ మధ్య కాలంలో తెలుగు, తమిళం, హిందీ భాషలలోను వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ఇటీవలి కాలంలో రష్మిక నటించిన చాలా చిత్రాలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.